క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనద లిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొన దలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాక్సినేషన్



విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎంలు

అల్లిపురం : డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లోని 6,7 తరగతులు విద్యార్థులకు ఆరోగ్య సిబ్బంది శుక్రవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తులసి, భారతి, అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆశ వర్కర్ డి.నాగజ్యోతితో పాటు వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నాయకుడు పాల శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల పంపిణీ



టూ వీలర్ విజేతకు తాళం అందజేస్తున్న సెల్‌పాయింట్, ఒప్పో ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : సంక్రాంతి పండగ సంబరాలను పురస్కరించుకుని సెల్ పాయింట్‌లో మొబైల్ కొనుగోలు చేసిన వారికి శుక్రవారం దాబాగార్డెన్స్‌లో గల సెల్‌పాయింట్ షోరూం వద్ద పలువురు కస్టమర్ల సమక్షంలో డ్రా తీశారు. సెల్‌పాయింట్, ఒప్పో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రాలో గాజువాకకు చెందిన విజయ్‌కుమార్, గాజువాక–2కి చెందిన వి. అరుణ, విజయనగరానికి చెందిన కంచుమోజు కల్పన, భీమవరం–3కి చెందిన ముసునూరి శ్రీను, హనుమాన్ జంక్షన్‌కు చెందిన వెంకటేశ్వరరావు విజేతలుగా నిలిచారు. విజేతలకు సెల్‌పాయింట్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెల్ పాయింట్ సంస్థ చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, ఏఎస్ఎంలు గోవింద్, రాజేష్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం



మాట్లాడుతున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఆదేశాల మేరకు అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ శుక్రవారం పోలింగ్‌బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని కోరారు. వి.వేశంగిణి, శ్యామ్‌సుందర్, శ్రీను, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, కల్యాణ్, చిన్నమూర్తి, మధు, లూర్దు, రంజనమ్మ, లక్ష్మి, జోజీ, జాన్, రమేష్ సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దినకర.. శుభకర

- వైభవంగా రథసప్తమి వేడుకలు
- ఆలయాలకు భక్తుల తాకిడి
- ప్రత్యక్ష దైవానికి ప్రత్యేక పూజలు

సమస్త లోకాలకు మూలాధారం సూర్యభగవానుడు. సూర్యుడు లేని జగత్తును ఊహించలేం. పంచాంగానికి అద్యుడు సూర్యుడే. హిందూ పంచాంగం ప్రకారం ప్రతి సంవత్సరం మాఘ మాసంలోని శుక్లపక్షం ఏడవ రోజున రథసప్తమి వస్తుంది. ఈ పండగను అచల సప్తమి, సూర్య జయంతిగా జరుపుకుంటాం. పురాణాల ప్రకారం మాఘ శుక్ల పక్షమి నాడే సూర్యుడు జన్మించాడు. ఇదే రోజున అయన సప్తాశ్వరూఢుడై భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ రోజు వేకువనే లేచి జిల్లేడు ఆకులు వేసిన నీటితో స్నానం చేయాలి. ఇలా చేస్తే ఎలాంటి రోగాలైనా తొలగిపోతాయని ప్రతీతి. రథసప్తమి నాడు ఆదిత్య హృదయం పఠిస్తే విజయం సిద్ధిసుంది. యుద్ధానికి ముందు రాముడు ఆదిత్య హృదయం పఠించి రావణుడిని సంహరించాడు.



శివరామకృష్ణ దేవస్థానంలో విశేష అలంకరణలో శ్రీసూర్యనారాయణస్వామి



విశేష అలంకరణలో రేణుక యల్లమ్మ అమ్మవారు



విశేష అలంకరణలో వెంకటేశ్వరమెట్ట సూర్యనారాయణస్వామి

అల్లిపురం : వెంకటేశ్వరమెట్టలోని అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త యల్లపు హరికృష్ణ, యల్లపు హేమంత్ పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు పానంగిపల్లి రంగనాథాచార్యులు, పానంగిపల్లి కేశవాచార్యులు శ్రీ వైఖానస ఆగమ సాంప్రదాయం ప్రకారం ఉషా, ఛాయా పద్మినీ సమేత శ్రీసూర్యనారాయణ స్వామికి తెల్లవారు జామున పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు. అనంతరం స్వామివారిని మందార, గులాబీ, చామంతి వంటి పూలతో విశేషంగా అలంకరించారు. స్వామి వారికి బెల్లం, గోక్షీరంతో తయారు చేసిన పరమాన్నం నివేదన చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని ధ్వజస్తంభం దరి నుంచే దర్శించుకుని తరించారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు అల్లిపురం పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అదే విధంగా జిల్లాలోని అనకాపల్లి, యలమంచిలి, పాయకరావుపేట ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రంగనాథాచార్యులు మాట్లాడుతూ సూర్యనారాయణస్వామిని ప్రార్థించడం వల్ల సమస్త రోగాలు నశించి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు.

శ్రీశివరామకృష్ణ దేవస్థానంలో..

టూటౌన్ దరి శ్రీశివరామకృష్ణ దేవస్థానంలో గల సూర్యనారాయణమూర్తి దేవాలయంలో స్వామికి ఆలయ అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

బెల్లం గణపతి ఆలయంలో..

రెల్లివీధి దరి బెల్లం గణపతి ఆలయంలో వెలసిన సూర్యనారాయణమూర్తికి ఆలయ అర్చకులు విశేష పూజలు చేశారు. పంచామృతాభిషేకాల అనంతరం స్వామిని విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఆదిత్యుని దర్శించుకునేందుకు బారులు తీరారు.

రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో..

కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలకు రథసప్తమి సందర్భంగా శ్రీకారం చుట్టారు. మార్చి 16, 17 తేదీల్లో అమ్మవారి 24వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకటప్పలనాయుడు, కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.రమణమూర్తి, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, కార్యదర్శి బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బడే నాగరాజు, దున్నబోయిన సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, వాసుపల్లి నర్సింగ్, గనగల్ల సత్యవతి, తమరపు మధు, భక్తులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొని అమ్మవారి ఉత్సవాలకు ముడుపు కట్టారు. అనంతరం జగదాంబ దరి యల్లమ్మ అమ్మవారి దేవాలయానికి వెళ్లి పసుపు, కుంకుమ అందజేసి అమ్మవారి నుంచి పండగ కోసం అనుమతి తీసుకున్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో..

దాబాగార్డెన్స్ : బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సూర్య రథ పద్మంపై ఆవు పిడకలతో పాలు పొంగించి స్వామికి క్షీరాన్నం నివేదించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యభగవానుడిగా భీమేశ్వర, రాజరాజేశ్వరి

పాతనగరం వన్‌టౌన్‌లో గల భీమేశ్వర రాజరాజేశ్వరి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీమేశ్వర, రాజరాజేశ్వరిని సూర్యభగవానుడి అలంకరణలో తీర్చిదిద్దారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు.



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కనకమహాలక్ష్మి ఆలయంలో సూర్యనారాయణ స్వామికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు



సూర్యభగవానుడిగా భీమేశ్వర, రాజరాజేశ్వరి

క్లాప్ వాహనాల రికార్డుల పరిశీలన



క్లాప్ వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ : క్లాప్ వాహనాల రికార్డులను జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ పరిశీలించారు. శుక్రవారం జోన్ పరిధిలో గల 12 వార్డులను పరిశీలించిన ఆయన జీవీఎంసీ 39వ వార్డు కార్యాలయంలో కూడా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఆరు గంటలకు వార్డులో ప్రతి ఇంటికి క్లాప్ వాహనాలు చేరుకోవాలన్నారు. సంబంధిత వార్డు సెక్రటరీలు పర్యవేక్షించడంతో పాటు వాహనాల రాకపోకల వివరాలు రికార్డుల్లో పొందుపరచాలన్నారు. అదే విధంగా వార్డుల్లో రహదారి సదుపాయం లేని ప్రాంతాల వివరాలు రికార్డుల్లో రాయాలన్నారు. దీని వలన ఏ వాహనం ఎంత ఆయిల్ ఖర్చు చేస్తుందీ తెలుస్తుందన్నారు. అదే విధంగా పారిశుధ్య కార్మికుల హాజరు పరిశీలించాలన్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది హాజరు కచ్చితంగా వేయాలన్నారు. దీని వలన ఎవరు వస్తుందీ తెలుస్తుందన్నారు. అనంతరం వార్డులో కాలువలు, రహదారులను సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

'మంగళగిరి ప్రజలు లోకేష్‌ను ఓడించాలి'



వంద రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేఏ పాల్

సీతమ్మధార : మంగళగిరి ప్రజలు లోకేష్‌ని ఓడించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ పిలుపునిచ్చారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విశాఖ ఎంపీగా తనను గెలిపిస్తే వంద రోజుల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. జనసేన, టీడీపీ, వైఎస్సార్‌సీపీ తమ పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. పాల్ రావాలి.. పాలన మారాలని అన్నారు. శనివారం సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు కేఏ పాల్ ఫంక్షన్ హాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో అన్ని పార్టీల వద్ద డబ్బులు తీసుకుని ప్రజాశాంతి పార్టీకి ఓట్లు వేయాలన్నారు. పొత్తులపై మాట్లాడుతూ ఈనాడు రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణ, టీడీపీతో పొత్తులు పెట్టుకోవాలని కోరిక అన్నారు. ఇప్పటికే రాష్ట్ర కాపు నాయకులతో మాట్లాడానని అన్నారు. చిరంజీవి కాంగ్రెస్‌కు, పవన్ కల్యాణ్ బీజేపీకి అమ్ముడుపోయారని అన్నారు. కాపులందరితో మీటింగ్ పెడతానన్నారు. బడుగు, బలహీన వర్గాలకే అధికారం రావడం అంబేడ్కర్ లక్ష్యమన్నారు. బీసీ, కాపులను ముఖ్యమంత్రి చేస్తామన్నారు. రాజకీయాలు ఫ్రాడ్ అయిపోయాయని అన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ తదితరులు

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఈనెల 18న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు శుక్రవారం శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేయనున్నట్టు చెప్పారు. అవసరమైన వారికి అదే రోజు శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ మక్సూద్ అహ్మద్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు ప్రతినిధి వై. పైడిరాజు, సంస్థ సభ్యులు వి. దానయ్య, పి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా



జామియా మసీదు వద్ద ప్రజాదర్బార్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి 24 గంటలు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు. 36వ వార్డు పరిధి ఏవీఎన్ కాలేజీ జామియా మసీదు వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి నేరుగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. ఆశీస్సులు అందజేస్తున్న ప్రజలకు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రోజులో కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువ సమయం ప్రజలతోనే ఉంటున్నానని, ప్రజలు ఇచ్చిన ఈ హోదాకు రుణం తీర్చుకోవడం బాధ్యతగా బాధ్యతగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆపద వచ్చిందని తనకు ఫోన్ చేస్తే ఆదుకుంటానన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు మళ్లీ తనను ఎమ్మెల్యేగా చేస్తాయని, వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తపో దీక్షలతో పాప పరిహారం



రక్షణగిరిపై దైవ సందేశం ఇస్తున్న ఫాదర్లు

కంచరపాలెం : మానసిక ప్రశాంతత, పాప పరిహారానికి తపో దీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని జ్ఞానాపురం రక్షణగిరి పుణ్యక్షేత్రం, సెయింట్ పీటర్స్ పునీత పేతురు రాయప్ప ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ అన్నారు. జ్ఞానాపురం రక్షణగిరిలో శుక్రవారం పీపీసీ ఆధ్వర్యంలో 'తపస్సు కాల మొదటి శుక్రవారం సిలువ మార్గం' యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ మాట్లాడుతూ తపోదీక్షను స్వీకరించిన వారు అనేక జ్ఞాన వరాలు పొందుతారని, దయామయులుగా మారుతారన్నారు. కార్యక్రమంలో ఫాదర్లు వేశంగి జీరాజు, ప్రభాకర్, పీపీసీ సభ్యులు, క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

'ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తా'



మాట్లాడుతున్న తెలుగుదండు సూరి

సీతమ్మధార : విశాఖ ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలుగు దండు సంస్థ అధ్యక్షుడు పరవస్తు ఫణిశయనసూరి అన్నారు. తెలుగు దండు పాలికేక పేరుతో పాదయాత్ర ప్రారంభిస్తున్న సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 24 గంటల ఉపవాస దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పరవస్తు పద్మ పీఠం, తెలుగు దండు ఆధ్వర్యంలో తెలుగు భాష రక్షణకు ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్‌లో పంచాయితీ పెట్టి ప్రాణత్యాగం చేసైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువస్తానని, మాతృభాషను పరిరక్షించుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో రాజమన్నార్, గంగరాజు, భానుకుమార్, సాహితీవేత్తలు డి.వి.సూర్యారావు, కామేశ్వరశర్మ, చిన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆటోలపై ట్రాఫిక్ పోలీసుల కొరడా



అధిక లోడ్‌తో ఉన్న ఆటో ఫొటో తీస్తున్న ట్రాఫిక్ పోలీస్



మద్యం సేవించిన వ్యక్తిని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 కార్యాలయం వద్ద శుక్రవారం ఆటోల రికార్డులను ట్రాఫిక్ పోలీసులు తనిఖీ చేశారు. ద్వారకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ భాస్కరరావు ఆశీలమెట్ట, రామాటాకీస్ తదితర ప్రాంతాల్లో నిబంధనలు పాటించని ఆటోలకు ఫైన్లు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆటోలో ఎక్కువ మందిని ఎక్కిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాల్లో దించాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు..

మద్యం సేవించి వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేశారు. మద్యం సేవించిన వాహనదారులకు ఫైన్ విధించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

శివరాత్రి ఉత్సవ నిర్వహణపై సమీక్ష



ఎరుకుమాంబ ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న చైర్మన్ సర్వేశ్వరరెడ్డి తదితరులు

సీతమ్మధార : దొండపర్తిలోని శ్రీఎరుకుమాంబ ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.రమాబాయి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అలాగే శనివారం (నేడు) ఉదయం 9 గంటలకు శ్రీగణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ ఆదివారం ఉదయం 10.40 గంటలకు శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవమూర్తి, శ్రీమహాగణపతి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు పిల్లి స్వాతి, పిల్లి దుర్గ, లక్ష్మీనారాయణమ్మ, ఎస్.నర్సింగరావు, కె.బ్రహ్మాజీరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో స్మార్ట్‌సిటీ ఈఈ మృతి



ఈఈ సుధాకర్ (ఫైల్)

దాబాగార్డెన్స్ : అనారోగ్య కారణాలతో స్మార్ట్ సిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి. సుధాకర్ శుక్రవారం మృతి చెందారు. స్మార్ట్ సిటీ ఏర్పాటుకు ముందు నుంచి జీవీఎంసీలో సుధాకర్ విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

రేపట్నుంచి అంతర్జాతీయ చర్చావేదిక



మీడియాతో మాట్లాడుతున్న రాఘవేంద్రన్

సీతమ్మధార : శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత సాంస్కృతిక చరిత్ర పునర్నిర్మాణం–సంశయాలు, దృక్పథాలు అనే అంశంపై ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాలలో 18,19 తేదీల్లో రెండు రోజుల పాటు అంతర్జాతీయ చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్లు ఆర్. రాఘవేంద్రన్, వై.సుదర్శనరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆశీలమెట్టలోని ఒక హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రాతిపదికగా భారతీయ సమాజం ఏర్పడిందన్నారు. ప్రాచీన భారతీయ సాహిత్యం, వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అందరినీ ఆకర్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ ఎస్.రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీని తగ్గించి వారికి సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా..

- టాటా–ఎర్నాకుళం(08189) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 19, 26 తేదీల్లో తెల్లవారు 5.15 గంటలకు టాటాలో బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మూడో రోజు మధ్య రాత్రి 1.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో ఎర్నాకుళంలో ఈ నెల 22, 29 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి మూడో రోజు వేకువజాము 4.35 గంటలకు టాటా చేరుకుంటుంది.

- కన్యాకుమారి–డిబ్రూఘడ్(06103) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, మార్చి 1, 15, 29 తేదీల్లో (శుక్రవారాలు) సాయంత్రం 5.25 గంటలకు కన్యాకుమారిలో బయల్దేరి మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖ వచ్చి, ఇక్కడ నుంచి 12.05 గంటలకు బయల్దేరి సోమవారాల్లో రాత్రి 8.50 గంటలకు డిబ్రూఘడ్ చేరుకుంటుంది.

తిరుగు ప్రయాణంలో డిబ్రూఘడ్– కన్యాకుమారి(06104) స్పెషల్ ఈ నెల 21, మార్చి 6, 20, ఏప్రిల్ 3 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు డిబ్రూఘడ్‌లో బయల్దేరి మూడో రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం వచ్చి, అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారాల్లో రాత్రి 9.55 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది.

తెరపైకి మరోసారి రింగు వలల వివాదం



జాలరిపేటలో పోలీసుల బందోబస్త్

ఎంవీపీకాలనీ: రింగువలల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. రింగు వలల వేట గత కొంతకాలంగా మత్స్యకారుల మధ్య వివాదాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. రింగు వలల వేటను తొలినుంచి 19వ వార్డు వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు స్వాగతిస్తుండగా, పెదజాలరిపేట మత్స్యకారులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గతంలో భారీస్థాయిలో ఘర్షణలు తలెత్తాయి. తీవ్రస్థాయిలో ఆస్తినష్టం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాలతో మత్స్యకార శాఖ పలు సమావేశాలు నిర్వహించింది. పలుమార్లు ఇరువర్గాల మధ్య ఈ సమావేశాలు జరిగినా వివాదం కొలిక్కిరాలేదు. అయితే వాసవానిపాలెం, జాలరి ఎండాడ మత్స్యకారులు రింగువలలతో వేట వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీంతో మరోసారి గొడవలు జరిగే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి పూట కూడా పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.